సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.20 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 506 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.25
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టం రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.1°/22.8°

జిల్లాలో గురువారం తుపాను వాతావరణం నెలకొంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పలు మండలాల్లో వర్షం



గోరంట్ల ప్రాంతంలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ పలు మండలాల్లో వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. మడకశిర మండలంలో 16.6 మి.మీ , అగళిలో 8.4, ఓడీ చెరువు 8.2, గుడిబండ 4.2, తాడిమర్రిలో 1.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. గురువారం సాయంత్రం పుట్టపర్తి, గోరంట్ల, నల్లమాడ, పెనుకొండ మండలాల్లో వర్షం కురిసింది. తుపాను ప్రభావంతో మరో రెండు రోజులు వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల తనిఖీ



వర్మీకంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న డీపీఓ విజయ్‌కుమార్

కదిరి అర్బన్: మండలంలోని కొండమనాయునిపాళెం, కుమ్మరవాండ్లపల్లి గ్రామాల్లో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్తతో సంపద తయారీ కేంద్రం)లను గురువారం జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని గ్రామ పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలను తప్పనిసరిగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఆయా కేంద్రాల చుట్టూ పరిశుభ్రత పాటించాలన్నారు. క్లాప్ మిత్రలతో ఇంటింటి చెత్త సేకరణ చేపట్టి వర్మీ కంపోస్ట్ తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. పీఆర్ వన్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. డీపీఓ వెంట డివిజనల్ పంచాయతీ అధికారి అంజనప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

జీవితం ముక్కలు

జిల్లా పరిధిలో పేకాట మూడు ముక్కలు ... ఆరు షోలుగా సాగుతోంది. అడ్డుకోవాల్సిన పోలీసు యంత్రాంగం మొద్దు నిద్రలో ఉండటంతో జూదగాళ్లు రెచ్చిపోతున్నారు. దీనికి తోడు తెలుగుదేశం పార్టీకి చెందిన కీలక నేతలు అండదండలు ఉండటంతో రోజూ రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. అయితే జూదానికి అలవాటు పడిన వారు సర్వం కోల్పోతుండటంతో వారినే నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.



జిల్లాలో జోరుగా పేకాట
- రహస్య స్థావరాల్లో జూదం
- అండగా నిలుస్తోన్న టీడీపీ ప్రజాప్రతినిధులు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు
- రోజూ రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనం

సాక్షి, పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా పేకాట కేంద్రాలు అంతకంతకూ విస్తరిస్తున్నాయి. జిల్లాలోని పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తిలో పేకాటకు సంబంధించి రహస్య స్థావరాలు పదుల సంఖ్యలో నడుపుతున్నట్లు సమాచారం. హిందూపురం సరిహద్దు ప్రాంతాల్లోనూ ఎటు చూసినా పేకాట స్థావరాలే ఉన్నట్లు తెలుస్తోంది. ఒకరోజులోనే మూడు నాలుగు చోట్ల ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం.. ఇలా సమయానికి అనుగుణంగా స్థావరాలు మారుస్తూ.. ప్రత్యేక బృందాలతో పేకాట ఆడిస్తున్నట్లు సమాచారం. ప్రజాప్రతినిధుల వద్ద పని చేసే వారి అండదండలతో పేకాటరాయుళ్లకు అడ్డు అదుపు లేకుండా పోయింది. పోలీసులకు కూడా మామూళ్లు ముట్టజెబుతూ ఆ వైపునకు రాకుండా చేస్తున్నారంటున్నారు.

వారంతపు సెలవుల్లో మరింత జోరు..

ప్రతి శని, ఆదివారాల్లో కర్ణాటక నుంచి జూదగాళ్లు వస్తున్నారు. వారితో షో అయ్యాక.. ఆట గెలిచిన వారితో నిర్వాహకులు 20 శాతం కమీషన్ తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఆటలో చేరాలంటే కనీసం రూ.లక్ష డిపాజిట్ రూపంలో ముందుగా చూపించాలనే షరతు కూడా విధించినట్లు తెలిసింది. ఈ లెక్కన ఆడించే వారికి రోజుకు రూ.నాలుగైదు లక్షలు అక్రమంగా ఆదాయం వస్తోందని చెబుతున్నారు. అడపాదడపా అడ్డు తగిలే పోలీసులకు అంతో ఇంతో ఇచ్చి మమ అనిపిస్తున్నారు. అందువల్లే చాలా చోట్ల పోలీసులు దాడులు కూడా చేయడం లేదన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఒకట్రెండు చోట్ల దాడులు చేసినా.. ఒకరు దొరికితే మరొకరిని చూపిస్తున్నారని చెబుతున్నారు. ఎంత మొత్తం దొరికిందనే దానిపై కూడా అనేక అనుమానాలు ఉన్నాయి. ఉదాహరణకు రూ.10 లక్షలు దొరికినా రూ.ఒకట్రెండు లక్షలు చూపించి వదిలేస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఆధ్యాత్మిక కేంద్రంలోనూ...

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి చుట్టుపక్కల పేకాట కలకలం రేపుతోంది. టీడీపీలో కీలకంగా మారిన ఇద్దరు సోదరుల నేతృత్వంలోనే పేకాట స్థావరాలు ఉన్నట్లు తెలిసింది. ఆ ఇద్దరు గతంలో కూడా చాలాసార్లు పోలీసులకు పట్టుబడిన వారే. అందులో ఒకరిపై రౌడీషీట్ కూడా ఉంది. అందుకే మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే సింధూరారెడ్డి సైతం ఏమీ మాట్లాడలేని పరిస్థితి ఉందని తెలిసింది.

బాలయ్య పీఏ కనుసన్నల్లో..

హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏ కనుసన్నల్లోనే పేకాట జోరుగా జరుగుతున్నట్లు సమాచారం. సదరు పీఏ గతంలో ఓసారి కర్ణాటకలో పేకాట ఆడుతూ గౌరిబిదనూరు పోలీసులకు పట్టుబడ్డాడు. అక్రమార్జనే ధ్యేయంగా అనుకూలమైన పోలీసులను నియమించుకుని దందా చేస్తున్నారన్న విమర్శలున్నాయి. అడ్డు తగులుతున్నారనే ఉద్దేశంతో ఇటీవల ముగ్గురు సీఐలను కూడా వీఆర్‌కు పంపించారంటున్నారు.

పెనుకొండ, ధర్మవరంలోనూ...

జాతీయ రహదారి సమీపంలో పెనుకొండ చుట్టుపక్కల పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా ధర్మవరం నియోజకవర్గంలో తాడిమర్రిలో విపరీతంగా పేకాట జరుగుతోంది. ఆయా నియోజకవర్గాలకు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. తీరు మారడంలేదని ప్రజలు వాపోతున్నారు. మామూళ్ల కోసం పోలీసులు కూడా పేకాటను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పుట్టపర్తి సమీపంలో ఓ క్లబ్ ఏర్పాటుకు కూడా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

కుటుంబాలు చిన్నాభిన్నం..

చాలామంది పేదలు, యువత పేకాట మత్తులో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. కేసుల్లో ఇరుక్కుంటుండటంతో పాటు ఆర్థికంగా దెబ్బతిని కుటుంబాన్ని గాలికొదిలేస్తున్నారు. జూదానికి డబ్బుల్లేక కొందరు దొంగతనాలకు కూడా అలవాటు పడుతున్నారు. మరికొందరు డబ్బుల కోసం ఎలాంటి నేరం చేసేందుకైనా వెనుకాడటం లేదు. దీంతో వారినే నమ్ముకున్న కుటుంబ సభ్యులు రోడ్డున పడుతున్నారు.

అడపాదడపా కేసులు..

పేకాట స్థావరాలతో పాటు ఎవరు ఆడిస్తున్నారో కూడా పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి ఉండటంతో జీ హుజూర్ అనాల్సిన పరిస్థితి. కొన్ని చోట్ల ఇదే అదునుగా మామూళ్లు వసూలు చేస్తున్నారని అంటున్నారు. మరికొన్ని చోట్ల ఖాకీలే కేసులను పక్కదోవ పట్టిస్తున్నారన్న విమర్శలున్నాయి. దీంతో పోలీసులు ప్రజల్లో నమ్మకం కోల్పోతున్నారు.

మంత్రుల ఇలాకాల్లో మచ్చుకు కొన్ని..



- జూలై 25న తాడిమర్రి మండలం రామాపురం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరుసటి రోజే (జూలై 26న) పిన్నదరి గ్రామ సమీపంలో పది మంది జూదరులను పట్టుకున్నారు.
- ఈనెల 3వ తేదీన పెనుకొండ మండల శెట్టిపల్లి సమీపంలో పేకాట స్థావరాలపై దాడి చేసి 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. సుమారు రూ.17 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అయితే అక్కడ రూ.70 లక్షల వరకూ దొరికినట్లు సమాచారం.

జూదంపై ప్రత్యేక దృష్టి



జూదంపై ప్రత్యేక దృష్టి సారించాం. బలగాలను దింపి తనిఖీలు చేయిస్తున్నాం. పేకాట వెనుక ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదు. ఎంతటి వారైనా చట్టానికి అతీతులు కాదు. యువత జూదానికి అలవాటు పడి జీవితం నాశనం చేసుకోకూడదు. జూదం కారణంగా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. – వి.రత్న, ఎస్పీ

నాణ్యమైన భోజనం అందించాలి
- కలెక్టర్ చేతన్



విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ చేతన్, డీఈఓ మీనాక్షి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి మండలం పెడపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈఓ మీనాక్షితో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ ఆకలి బాధను దూరం చేయడం, పాఠశాలలో చేరే వారి సంఖ్య పెంచడం, పిల్లల్లో సామాజిక సమ భావన పెంపొందించడం, పౌష్టికాహార లోపాన్ని తగ్గించడమే మధ్యాహ్న పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని, ప్రతి వారం ఆకస్మిక తనిఖీలకు వస్తానన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ గార్డెన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతి రోజూ భోజనం ఎలా ఉంటుంది? గుడ్డు ఇస్తున్నారా? పాఠాలు బాగా చెబుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. న్యూట్రిషన్ గార్డెన్‌ను చక్కగా చూసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పాఠశాలల ఆవరణలు అన్నీ చూడముచ్చటగా మొక్కలతో కళకళ లాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, హెచ్‌ఎం రమామణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21 నుంచి 'అమూల్' పాలసేకరణ నిలిపివేత



కదిరి అర్బన్: జిల్లాలో ఈ నెల 21 నుంచి పాలసేకరణ నిలిపివేస్తున్నట్లు అమూల్ డెయిరీ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 20 సాయంత్రం షిఫ్ట్ ముగిశాక జిల్లాలో పాలసేకరణ ఆగిపోతుందని వెల్లడించారు. అమూల్ డెయిరీ అనుబంధ బీఎంసీలు ఆగస్టు 21 నుంచి పాల సరఫరా చేయొద్దన్నారు. ఆంధ్రప్రదేశ్ పాల నిర్మూలనా నిబంధనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. రైతుల బిల్లులు ప్రామాణిక ప్రక్రియ విధానంగా యథావిధిగా జరుగుతుందన్నారు. పాడి రైతులు, మహిళా డెయిరీ సంఘాల కార్యదర్శులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఈ విషయంపై మరింత స్పష్టత కోసం తమ ఫీల్డ్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో దౌర్జన్యకాండ



బత్తలపల్లిలో పాఠశాల ముందు ఘర్షణ పడుతున్న కూటమి నేతలు

- హిందూపురంలో బరితెగించిన టీడీపీ నాయకులు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలు గెలిచినా అడ్డగింత
- అధికారులను బెదిరించి ఎన్నిక వాయిదా వేయించిన వైనం
- ధర్మవరంలో టీడీపీ, బీజేపీ నాయకుల మధ్య ఘర్షణ



హిందూపురం మండలం మలుగూరు ఎన్నికను అడ్డుకోవడానికి యత్నిస్తున్న టీడీపీ నాయకులు

పుట్టపర్తి: జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు దౌర్జన్యకాండకు దిగారు. హిందూపురం మండలం మలుగూరులో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలు గెలిచినా ప్రకటించకుండా అధికారులను బెదిరించారు. ఒత్తిడి తెచ్చి ఏకంగా ఎన్నిక వాయిదా వేయించారు. రేగాటిపల్లి ఎంజేపీ జ్యోతిరావు పూలే పాఠశాలలో టీడీపీ, బీజేపీ నాయకులు ఘర్షణకు దిగారు.

10 పాఠశాలల్లో వాయిదా..

జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో భాగంగా 10 పాఠశాలల్లో కోరం లేక వాయిదా వేసినట్లు డీఈఓ మీనాక్షి, సీఎంఓ అబ్దుల్ మాలిక్ పేర్కొన్నారు. హిందూపురం మండలం మలుగూరు పాఠశాల, బత్తలపల్లి సమీపంలోని రేగాటిపల్లి ఎంజేపీ జ్యోతిరావు పూలే పాఠశాలల్లో గొడవల కారణంగా కమిటీల ఎంపిక వాయిదా వేశారు. అలాగే ఎన్‌పీకుంట మండలం పేడబల్లి, ధన్యాని చెరువు, తలుపుల మండలం నూతన కాలువ, సంగటి వారిపల్లి, తనకల్లు మండలం రత్నానాయక్ తండా, రొద్దం మండలం కోగిర, గాండ్లపెంట మండలం జీనులకుంట ఉర్దూ, చిన్నక్కగారిపల్లి పాఠశాలల్లో ఎన్నికలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం పెడపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికలను డీఈఓ పర్యవేక్షించారు.

టీడీపీ, బీజేపీ మధ్య వార్

బత్తలపల్లి: మండల కేంద్రానికి సమీపంలోని మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల (రేగాటిపల్లి)లో చైర్మన్‌ను నిలబెట్టే విషయంలో టీడీపీ, బీజేపీ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. తాజా మాజీ చైర్మన్ కొడవండ్లపల్లి చంద్రశేఖర్‌కు బీజేపీ నాయకుడు కోటి సూర్యప్రకాష్‌బాబు మద్దతివ్వడంతో టీడీపీ నాయకులు అడ్డుచెప్పారు. వైఎస్సార్‌సీపీకి చెందిన వారితో నామినేషన్ ఎలా వేయిస్తారంటూ టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ వారు మాత్రమే పాఠశాలలోకి ప్రవేశించి ఎవరినీ రాకుండా అడ్డుకున్నారు. బీజేపీ నాయకులు సైతం పోటీకి ప్రయత్నించడంతో పాఠశాల ముందు ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. సమయం దాటిపోవడంతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ఎంఈఓ గోపాల్‌నాయక్ ప్రకటించారు.

రెచ్చిపోయిన టీడీపీ నాయకులు

హిందూపురం: మండలంలోని మలుగూరు ప్రాథమిక పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలు లావణ్య పూర్తి మెజార్టీతో గెలిచినా టీడీపీ నాయకులు, మద్దతుదారులు దౌర్జన్యానికి పాల్పడి ఎన్నికను అడ్డుకున్నారు. టీడీపీ నాయకుల ఒత్తిడితో హెచ్‌ఎం ఎన్నికను వాయిదా వేశారు. లావణ్య మద్దతుదారులతో గెలిచిన తనకు డిక్లరేషన్ ఇవ్వాలని పాఠశాల ముందు బైఠాయించారు. పోలీసులు లావణ్యతో పాటు మద్దతుదారులను బలవంతంగా పాఠశాల నుంచి బయటకు పంపించారు. టీడీపీ వర్గీయులు దౌర్జన్యం, బెదిరింపులు చేస్తున్నా పోలీసులు కూడా వారికే వత్తాసు పలకడం దారుణమని లావణ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేషన్ .. పరేషాన్

ఓడీచెరువు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసేవారు. దీంతో లబ్ధిదారులకు ఏ ఇబ్బందిలేకుండా పోయేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో రేషన్‌దారులు పరేషాన్‌కు గురవుతున్నారు. రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాస్తూ నిత్యావసరాలు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమున్నప్పుడే బాగుండెనప్ప.. అని ఎంతోమంది గత ప్రభుత్వ పనితీరును గుర్తుచేసుకుంటున్నారు.



ఓడీ చెరువులో రేషన్ దుకాణం వద్ద గురువారం పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

'జై'ఎస్‌ఎన్‌ఎల్!

- బీఎస్‌ఎన్‌ఎల్ వైపు వినియోగదారుల చూపు
- గత 35 రోజుల్లోనే ఉమ్మడి అనంతలో 25 వేల మంది షిఫ్ట్
- ఇందులో 70 శాతం మంది జియో సర్వీసు వినియోగదారులే
- టారిఫ్ రేట్లు భారీగా పెరగడంతోనే అటువైపు మొగ్గు
- ఇప్పటికీ 4జీ సేవల్లో వెనుకంజలో సంస్థ
- ఇంటర్నెట్ సేవల్లో స్పీడు పెంచితే మళ్లీ పూర్వ వైభవం



సాక్షి ప్రతినిధి, అనంతపురం/ పుట్టపర్తి టౌన్ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది మంది బీఎస్‌ఎన్‌ఎల్ వైపు పరుగులు తీస్తున్నారు. ప్రైవేటు సర్వీస్ ప్రొవైడర్ల టారిఫ్ ఛార్జీలు భారమయ్యాయని, అందుకే మారుతున్నట్టు చెబుతున్నారు. రెండు లేదా మూడు సిమ్‌లు ఉన్న వారు ఒక్క సిమ్‌తో సరిపెట్టుకుంటున్న పరిస్థితి. కొత్తగా కొనేందుకు కొందరు, పోర్టు ద్వారా మార్చుకునే వారు ఇంకొందరు ఇలా బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్ కార్డులకు క్యూ కడుతున్నారు.

జియో కస్టమర్లే ఎక్కువ..

సరిగ్గా జూలై 1న జియో, ఎయిర్‌టెల్ సంస్థలు టారిఫ్ రేట్లను భారీగా పెంచాయి. నెలకు రూ.249 ఉన్న రేటు రూ.349 చేశాయి. ప్యాకేజీల వారీగా ఈ రేట్లు పెరిగిపోయాయి. దీంతో వినియోదారులు బెంబేలెత్తిపోయారు. టారిఫ్‌లు పెంచని బీఎస్‌ఎన్‌ఎల్ వైపు మొగ్గు చూపడం ప్రారంభించారు. జూలై ఒకటో తేదీనుంచి 31వ తేదీకి అంటే కేవలం ఒక్క నెలలోనే 20 వేల మంది కస్టమర్లు బీఎస్‌ఎన్‌ఎల్‌కు మారారు. ఆగస్టు 7 నాటికి మరో 5 వేల మంది సిమ్ తీసుకున్నారు. మారిన కస్టమర్లలో 70 శాతం మంది జియో నుంచి, 30 శాతం మంది ఎయిర్‌టెల్ నుంచి వచ్చిన వారున్నారు. రానున్న మూడు నాలుగు నెలల్లో మరికొంతమంది బీఎస్‌ఎన్‌ఎల్‌కు మారే అవకాశం ఉంది.

సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చిన తాజా ప్యాకేజీలో ఒకటి ఇలా..			
ప్రొవైడర్	గడువు	ప్యాకేజీ	సామర్థ్యం
బీఎస్‌ఎన్‌ఎల్	82 రోజులు	రూ.485	1.5 జీబీ
ఎయిర్‌టెల్	84 రోజులు	రూ.859	1.5 జీబీ
జియో	82 రోజులు	రూ.859	1.5 జీబీ

సిమ్ ధర ఎక్కువైనా..

రెండు మాసాల క్రితం బీఎస్‌ఎన్‌ఎల్ సిబ్బంది కేవలం రూ. 30కు సిమ్‌కార్డు ఇస్తామన్నా ముందుకురాని కస్టమర్లు ఇప్పుడు రూ.150 పెట్టి కొంటున్నారు. దీంతో బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులే ఆశ్చర్యపోతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో నెల మొత్తం వెయ్యి సిమ్‌కార్డులు అమ్మితే గొప్పగా ఉండేది. ఈ క్రమంలోనే గత నెలలో 20 వేల సిమ్ కార్డులు అమ్ముడుబోవడం చూసి వారే నోరెళ్లబెడుతున్నారు.

జూలై నెలలో వివిధ సర్వీసుల నుంచి బీఎస్‌ఎన్‌ఎల్‌కు మారిన కస్టమర్లు		
జోన్	పోర్ట్‌కు వెళ్లనవి	కొత్త సిమ్‌లు
అనంతపురం	1,577	801
హిందూపురం	1,394	648
కదిరి	1,499	746
గుంతకల్లు	1,910	1,091
రాయదుర్గం	2,092	951
తాడిపత్రి	1,971	1,064
అనంతపురం-2	1,114	242

ఆగస్టు 1 నుంచి 7 వరకూ..

బీఎస్‌ఎన్‌ఎల్‌కు పోర్ట్ 3,480

కొత్త సిమ్‌కార్డులు 1,727

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొబైల్ ఫోన్లు..	
స్మార్ట్ ఫోన్లు	14 లక్షలు
కీప్యాడ్ ఫోన్లు	8 లక్షలు
మొత్తం	22 లక్షలు
సగటున నెలకు బిల్లు	రూ.55 కోట్లు (రూ.250తో)
ఏడాది బిల్లు	రూ.660 కోట్లు

ఇదిలా ఉండగా 4జీ సేవలు, 5జీ సేవలు అందుబాటులోకి తెచ్చి, ఇంటర్నెట్ సేవల వినియోగంలో మరింత పురోగతి చూపితే బీఎస్‌ఎన్‌ఎల్‌కు పూర్వ వైభవం వస్తుందని కస్టమర్లు అంటున్నారు.

వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది



ప్రైవేటు టెలికాం సంస్థలు మొబైల్ చార్జీలు పెంచడంతో బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ ప్రజలకు అండగా నిలబడింది. తక్కువ ధరకే సరికొత్త ప్లాన్‌లు తేవడంతో వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది. 4జీ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా టవర్ల సంఖ్య పెంచుతాం. దీంతో బీటెక్ చదువుకొన్న వారికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి.
– షేక్ ముజీర్ పాషా, జనరల్ మేనేజర్, శ్రీసత్యసాయి జిల్లా

రీచార్జ్ భారం పెరగడంతో పోర్ట్



మా కుటుంబంలో మూడు సిమ్‌లు ఉపయోగిస్తున్నాం. ఉన్నపళంగా రీచార్జ్ ప్లాన్లు పెరిగిపోవడంతో భారం పెరిగింది. ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎన్ టారిఫ్ ప్లాన్‌లు తక్కువగా ఉన్నాయి. దీంతో బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్ కొన్నా. నెట్‌వర్క్ కూడా బాగా వస్తోంది. 200 వందలతో రీజార్జ్ చేశా. వేరే సిమ్‌తో పోల్చుకుంటే రూ. 150 మిగిలింది.
– ఈశ్వర్‌రెడ్డి బీడుపల్లి, పుట్టపర్తి మండలం

సేవలు మెరుగవ్వాలి



ప్రైవేటు కంపెనీలు ఒక్క సారిగా రీచార్జ్ రేట్లు పెంచడంతో బీఎస్‌ఎన్‌ఎల్‌లోకి పోర్టు పెట్టుకొన్నా. రెండు రోజుల్లో ప్లాన్ మారి పోయింది. 4 జీ సేవలు అందుబాటులోకి తెచ్చి వినియోగదారులకు మరిన్ని సేవలు అందించాలి. త్వరలో ఫైబర్ కనెక్షన్ కూడా తీసుకోవాలని అనుకుంటున్నా. అందులో కూడా ప్లాన్లు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయి.
– తిరుపతేంద్ర పుట్టపర్తి

క్లుప్తంగా

హిందూపురం డీఎస్పీగా మహేష్



పుట్టపర్తి టౌన్: హిందూపురం డీఎస్పీగా కేవీ మహేష్ నియమితులయ్యారు. గుంటూరు వెస్ట్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయనను హిందూపురానికి బదిలీ చేస్తూ డీజీపీ తిరుమల రావు ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

వీడిన హత్య కేసు మిస్టరీ

- ప్రియుడితో కలసి భర్తను హతమార్చిన భార్య
- నిందితుల అరెస్ట్

గుంతకల్లు రూరల్: మండలంలోని గుండాలతండాకు చెందిన సేవ్యానాయక్ (45) హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం మోజులో ప్రియుడితో కలసి సేవ్యానాయక్‌ను భార్యనే హతమార్చినట్లుగా విచారణలో నిర్ధారణ కావడంతో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్ఐ దుగ్గిరెడ్డి వెల్లడించారు. ఈ నెల 5న సేవ్యానాయక్ హత్య విషయం తెలిసిందే. తనకున్న మూడెకరాల పొలంలో భార్య లలితమ్మతో కలసి వ్యవసాయంతో పాటు కూలి పనులు, బేల్దారి పనులతో జీవనం సాగిస్తుండేవాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా లలితమ్మ అదే గ్రామానికి చెందిన కృష్ణానాయక్‌తో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నట్లుగా గుర్తించిన సేవ్యానాయక్ పలుమార్లు ఆమెను మందలించాడు. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఈ నెల 5న కూలి పనుల నుంచి తిరిగొచ్చిన లలితమ్మ మధ్యాహ్నం తమ పొలం వద్దకెళ్లింది. కాసేపటి తర్వాత కూలి పనుల నుంచి ఇంటికి చేరుకున్న సేవ్యానాయక్... తన భార్య పొలానికి వెళ్లిన విషయం తెలుసుకుని ఆమెకు సద్ది తీసుకుని వెళ్లాడు. అప్పటికే లలితమ్మ, కృష్ణానాయక్ ఇద్దరూ పొలంలో కలసి ఉండడం గమనించిన సేవ్యానాయక్‌లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వివాహేతర సంబంధం మంచిది కాదని చెప్పినా వినకుండా పరువు తీస్తున్నావంటూ ఆమెను కొట్టేందుకు వెళ్లాడు. ఆ సమయంలో సేవ్యానాయక్‌ను కృష్ణానాయక్, లలితమ్మ రాళ్లతో కొట్టి హతమార్చారు. నేరాన్ని లలితమ్మ అంగీకరించడంతో గురువారం ఉదయం ఆమెతో పాటు కృష్ణానాయక్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

- రెండు రోజుల్లోనే ఛేదించిన పోలీసులు
- రూ.10,30,500 నగదు, కిలోకు పైగా వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వి.రత్న



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

కదిరి టౌన్: స్థానిక మదనపల్లి రోడ్డులో రాధికా థియేటర్ సమీపంలో నివాసముంటున్న యామిని మెడికల్ స్టోర్ యజమాని ఇంట్లో ఈ నెల 5న జరిగిన చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీ జరిగిన 48 గంటల్లోనే మిస్టరీని ఛేదించిన పోలీసులను ఎస్పీ వి.రత్న అభినందించారు. వివరాలను గురువారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రత్న వెల్లడించారు. ఈ నెల 5న యామిని మెడికల్ స్టోర్ యజమాని మధుసూదన్ మరో ఊరిలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. అదే రోజు మధుసూదన్ కుటుంబసభ్యులను ఏమార్చి లోపలకు ప్రవేశించిన దుండగులు రూ.11 లక్షల నగదు, 2 కిలోల వెండి సామగ్రిని అపహరించుకెళ్లారు. ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కదిరి డీఎస్పీ శ్రీలత నేతృత్వంలో సీఐ కె.పుల్లయ్య, పట్టణ ఎస్ఐలు, సీసీఎస్, ఎస్బీ, ఐడీ పార్టీ సిబ్బంది బృందాలుగా విడిపోయి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో నేహా ఫంక్షన్ హాల్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న షేక్ హైదర్‌వలి, షేక్ అల్తాఫ్, కేదారి మహేష్, కొండపాళ్యం ఖాజాను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో మెడికల్ స్టోర్‌లో చోరీ చేసింది తామేనని అంగీకరించారు. దీంతో వారి నుంచి రూ.10,30,500 నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక కిలో 340 గ్రాముల వెండి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

ఇంటి దొంగ పనే...

మధుసూదన్ ఇంట్లో చోరీ చేసింది మెడికల్ స్టోర్‌లో ఎంతో నమ్మకంగా పనిచేస్తున్న యువకుడేనని ఎస్పీ స్పష్టం చేశారు. దాదాపు పదేళ్లుగా మెడికల్ స్టోర్‌లో పనిచేస్తున్న హైదర్‌వలి చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. తన జల్సాలు తీర్చుకునేందుకు శక్తికి మించి అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పుల వారి నుంచి ఒత్తిళ్లు తీవ్రం కావడంతో సులువుగా డబ్బు సంపాదించేందుకు తన యజమాని ఇంట్లోనే చోరీ చేయాలని భావించాడు. ఇందుకు తన స్నేహితులు షేక్ అల్తాఫ్, మహేష్ సహకారం తీసుకున్నాడు.

చోరీ చేశారిలా...

ఈ నెల 5న యజమాని మధుసూదన్ వ్యక్తిగత పనిపై మరో ఊరికి వెళ్లడంతో ఆయన భార్య కళ్యాణి మెడికల్ షాప్‌లో లావాదేవీలు నిర్వహిస్తూ వచ్చింది. మధ్యాహ్నం భోజన సమయంలో ఆమెకు అనుమానం రాకుండా మెడికల్ స్టోర్ వెనుకనే ఉన్న ఇంట్లోకి హైదర్‌వలి, అల్తాఫ్, మహేష్ చొరబడి బీరువాలోని నగదు, వెండి సామగ్రి అపహరించుకెళ్లారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో గురువారం నిందితులను అరెస్ట్ చేశారు. విచారణలో చోరీ సొత్తును దాచేందుకు తన మామ కొండపాళ్యం ఖాజాపీరా సాయం తీసుకున్నట్లుగా గుర్తించి, ఆయననూ అరెస్ట్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, చోరీ కేసులో మిస్టరీని ఛేదించి, నిందితులను అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ పుల్లయ్య, ఎస్ఐలు బాబ్జాన్, బలరామ్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విక్టర్, ఎస్బీ కానిస్టేబుళ్లు రామాంజులు, హరినాథ్‌రెడ్డి, నాగరాజు, సీసీఎస్ కానిస్టేబుళ్లు రాజప్ప, శివశంకర్‌రెడ్డిను ఎస్పీ అభినందిస్తూ రివార్డులు ప్రకటించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీ శ్రీలత, సీఐలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం



లక్ష్మీనారాయణ (ఫైల్)

పెనుకొండ రూరల్: కంటైనర్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రామగిరి మండలం పెనుబోలుకు చెందిన లక్ష్మీనారాయణ (35)కు భార్య లక్ష్మీనారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యులతో కలసి ధర్మవరం మండలం ఎర్రగుంటలో నివాసముంటూ పెనుకొండలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం వ్యక్తిగత పనిపై పెనుకొండ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఆయన... మార్గం మధ్యలో కియా పరిశ్రమ ఎదురుగా చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కంటైనర్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రంగడు యాదవ్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రైల్వే కూలీ ఆత్మహత్య

గుత్తి: జీవితంపై విరక్తితో ఓ రైల్వే కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వాసు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన మనోహర్ (23) గుత్తి జీఆర్పీ పరిధిలో రైల్వే కూలీ (ప్యాకింగ్ మిషన్)గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే తన ఆరోగ్యం ఇక కుదుట పడదని తెలుసుకుని జీవితంపై విరక్తితో గురువారం ఉదయం రాయలచెరువు రైల్వే స్టేషన్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వివాహిత బలవన్మరణం

గార్లదిన్నె: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కనుంపల్లికి చెందిన వైష్ణవి (26)కి ఐదు నెలల క్రితం అనంతపురం రూరల్ మండలం మన్నీలకు చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో వివాహమైంది. జూన్ 29న పుట్టింటికి వచ్చిన ఆమె తిరిగి అత్తారింటికి వెళ్లలేదు. ఈ క్రమంలో ఈ నెల 2న ఇంట్లోనే పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను కుటుంబసభ్యులు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. కాగా, ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

సబ్‌మెర్సిబుల్ పంప్ అపహరణ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నరేంద్ర

ధర్మవరం రూరల్: మండలంలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన రైతు విజయభాస్కరరెడ్డి పొలం బోరుబావిలో అమర్చిన సబ్‌మెర్సిబుల్ మోటార్‌ను దుండగులు అపహరించుకెళ్లారు. వివరాలు.. తనకున్న 3.75 ఎకరాల్లో చీనీ మొక్కలను విజయభాస్కరరెడ్డి నాటారు. నీటి కోసం బోరుబావిని ఏర్పాటు చేసి, సబ్‌మెర్సిబుల్ పంప్‌ను అమర్చాడు. డ్రిప్ ద్వారా మొక్కలకు నీరు పెడుతూ వచ్చాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు పొలంలోకి చొరబడి 700 అడుగుల లోతున ఉన్న సబ్‌మెర్సిబుల్ పంప్‌ను వెలికి తీసి, మోటార్‌తో పాటు కేబుల్ వైర్లు, స్టాటర్ పెట్టెను ఎత్తుకెళ్లారు. ఘటనలో నలుగురైదుగురు పాల్గొని ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. గురువారం ఉదయం తోట వద్దకు వెళ్లిన రైతు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో ధర్మవరం రూరల్ ఎస్ఐ నరేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అన్ని కమిటీలు లక్ష్యాన్ని అధిగమించాలి

- మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజనేయులు ఆదేశం



ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న రామాంజనేయులు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని మార్కెటింగ్ కమిటీలు ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాన్ని వంద శాతం అధిగమించాలని ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ)సి.రామాంజనేయులు ఆదేశించారు. మార్కెట్ ఫీజు వసూళ్లపై అనంతపురంలోని మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎస్ మూర్తి, అనంతపురం యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మితో పాటు సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో గురువారం ఆయన సమీక్షించారు. జూలై నెలాఖరుతో ముగిసిన నాలుగు నెలల కాలంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 17 మార్కెట్ కమిటీలు, 30 చెక్‌పోస్టులకు నిర్దేశించిన పన్ను వసూళ్ల ప్రగతిపై ఆరా తీశారు. అనంతపురం, శింగనమల, ఉరవకొండ, మడకశిర, తనకల్లు మార్కెట్ కమిటీల పరిధిలో వసూళ్లు ఆశాజనకంగా ఉండగా ధర్మవరం, గుత్తి, గుంతకల్లు, రాప్తాడు కమిటీల్లో వసూళ్ల పరిస్థితి దారుణంగా ఉందంటూ అసహనం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో రూ.12.06 కోట్లకు గానూ 30 శాతంతో రూ.3.56 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.5.31 కోట్లకు గానూ 29 శాతంతో రూ.1.52 కోట్లు వసూలైందని తెలిపారు. విజిలెన్స్ చర్యలు చేపట్టి చెక్‌పోస్టులు, యార్డుల్లో పన్ను వసూళ్లు, ఆదాయ వనరులు పెంచాలని ఆదేశించారు. అలాగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, రైతు సేవా కార్యక్రమాలు, పశువులు, జీవాల సంతల గురించి తెలుసుకున్నారు.

ఉత్కంఠ పోరులో ..

తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్ విజయం

- హోరాహోరీగా సాగుతున్న బాలికల ఫుట్‌బాల్ టోర్నీ
- నేడు తొలి సెమీఫైనల్



తొలి సెమీఫైనల్‌కు చేరుకున్న జార్ఖండ్ జట్టు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా జాతీయ స్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. గురువారం జరిగిన ఉత్కంఠ పోరులో తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. కేరళ జట్టుతో తలపడిన తమిళనాడు జట్టు 3–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. 2–0 గోల్స్ తేడాతో గుజరాత్‌పై అరుణాచల్ ప్రదేశ్ జట్టు గెలుపొందింది. శుక్రవారం ఉదయం తమిళనాడు– జార్ఖండ్ జట్ల మధ్య తొలి సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆంధ్ర ప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.వేణుగోపాల్ తెలిపారు.

బలం లేకపోయినా పోటీ ఎందుకు బాబూ?

- మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్



సోమందేపల్లి: స్థానిక సంస్థల్లో ఏ మాత్రం బలం లేకపోయినా... ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణపై పోటీకి టీడీపీ అధినేత చంద్రబాబు సిద్ధం కావడం చూస్తుంటే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. గురువారం ఆమె సోమందేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 640 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉన్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరిని ప్రలోభాలకు గురి చేయడమో లేదా దౌర్జన్యంతో బెదిరించి టీడీపీ అభ్యర్థి గెలుపొందేలా చంద్రబాబు కుట్రలకు తెరలేపారని మండిపడ్డారు. ఇప్పటికే తప్పుడు హామీలతో జనాన్ని మోసం చేసిన చంద్రబాబు... ఇప్పుడు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై ప్రలోభాల వల విసిరేందుకు సిద్ధమయ్యారన్నారు. ఎక్కడైనా కొత్త ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది తర్వాతనే వ్యతిరేకత కనిపిస్తుందని, కానీ రాష్ట్రంలో కేవలం రెండు నెలలకే కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. చంద్రబాబుకు అధికారం ఎందుకు కట్టబెట్టామా అని ఇప్పటికే ప్రజలు మదన పడుతున్నారన్నారు. జగనన్న ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈ పాటికి అమ్మ బడి, రైతు భరోసాతో పాటు చెప్పిన హామీలన్నీ నెరవేర్చే వారని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చి పేదల వైద్యానికి భరోసా లేకుండా చేయాలని కూటమి సర్కార్ కుట్ర చేస్తోందని మండిపడ్డారు.

కక్ష సాధింపులకు పాల్పడితే సహించం..

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని ఉషశ్రీచరణ్ హెచ్చరించారు. అధికారులు కూడా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే చట్టం ముందు దోషులుగా నిలబడాల్సి వస్తుందని హెచ్చరించారు. మంత్రి వెంట జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు

- ఈ నెల 1న మల్యాల వద్ద పంపింగ్ ప్రారంభం

బెళుగుప్ప: హంద్రీనీవా ద్వారా అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం ఉదయం కృష్ణా జలాలు చేరాయి. నంద్యాల జిల్లాలోని మల్యాల నుంచి లిఫ్టుల ద్వారా ఈ నెల 1న పంపింగ్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం వజ్రకరూరు మండలం రాగులపాడు లిఫ్ట్ వద్దకు జలాలు చేరుకున్నాయి. అక్కడ బుధవారం నుంచి ఎత్తిపోస్తుండడంతో గురువారం ఉదయం జీడిపల్లి రిజర్వాయర్‌కు చేరుకున్నాయి. జీడిపల్లి రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం 1.68 టీఎంసీలు రాగా, ప్రస్తుతం 0.24 టీఎంసీల నీరు నిల్వ ఉందని రిజర్వాయర్ ఏఈ సప్తర్దీన్ పేర్కొన్నారు. జలాశయం పూర్తిస్థాయిలో నిండిన తరువాత హంద్రీనీవా సెకెండ్ ఫేజ్‌కు విడుదల చేస్తామని అధికారులు పేర్కొన్నారు. జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు రావడంతో ఈ ప్రాంత రైతులు సంతోషం వ్యక్తం చేశారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి పుణ్యమే అంటూ గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

అర్హత లేకున్నా అందలం!

ఆయనొక సాధారణ ఇంజినీర్. ఐదేళ్లకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా దోచేశారు. రూ.కోట్లకు పడగలెత్తారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడడంతో తనంతట తనే పనిపాట లేని పోస్టులోకి వెళ్లిపోయారు. తిరిగి ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ఆయనకు రెక్కలొచ్చేశాయి. సహాయ ఇంజినీరే అయినా.. డివిజన్ ఇంజినీర్ పోస్టుపై కన్నేసి ఓ ప్రజాప్రతినిధి అండతో దక్కించుకున్నారు. పక్క జిల్లాలోని క్వాలిటీ సెల్ విభాగంలో పని చేస్తూ మళ్లీ పాత జిల్లాకు చేరుకున్నారు. ఇప్పుడు కీలక పోస్టులో ఉన్న ఆయన... తన సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధి పేరు చెప్పి దందాను మొదలు పెట్టేశారు.

తన రెగ్యులర్ సీటుకు వద్దామనుకున్న డీఈఈకి ఇక్కడా మరొకరు అడ్డుపడ్డారు. మరో ఎనిమిది నెలల్లో తాను ఉద్యోగ విరమణ పొందుతున్నానని, అప్పటి వరకు ఇక్కడి నుంచి కదలనంటూ మొండికేశారు. సంతకాలు, జీతాలు చేసుకుంటూ ఉండమని చెప్పి సర్దుబాటు చేశారు. కీలక బాధ్యతలన్నీ సహాయ ఇంజినీర్ చూసుకుంటుంటే.. సంతకాలు, ఉద్యోగుల జీతాల పని మాత్రం రెగ్యులర్ డీఈకి అప్పగించడం విడ్డూరంగా ఉందని శాఖలో ప్రస్తుతం జోరుగా చర్చ సాగుతోంది.



అనంతపురంలోని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం

- పంచాయతీరాజ్ శాఖలో కీలక సీట్లపై కన్ను
- డిప్యూటేషన్ల పేరుతో కోరుకున్న సీట్లలో ఆసీనులు
- ప్రజాప్రతినిధుల అండతో డీఈఈ పోస్టులో ఏఈలు
- కార్యాలయ అడ్మిన్లుగా డీఈఈలు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖలో సబ్ డివిజనల్ ఇంజినీర్లు(డీఈఈ), సహాయ ఇంజినీర్లు(ఏఈఈ) పోస్టులు చాలా కీలకం. కోట్లాది రూపాయల పనులు వీరి ఆధ్వర్యంలోనే జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఆయా హోదాలను బట్టి అదనపు ఆదాయం కూడా భారీగానే ఉంటుంది. దీంతో ఈ పోస్టులను దక్కించుకునేందుకు కొందరు తమవంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏఈఈలు తమ పలుకుబడితో ఎఫ్ఏసీ వెసలుబాటును అస్త్రంగా చేసుకొని ఏకంగా డీఈఈ సీట్లలో తిష్ట వేస్తున్నారు. మరి కొందరు డిప్యూటేషన్ల పేరుతో కోరుకున్న స్థానాల్లోకి సునాయసంగా చేరిపోతున్నారు. మరి కొందరు ప్రజాప్రతినిధుల చుట్టూ, ఇంకొందరు రాజధాని చుట్టూ తిరుగుతూ తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

డిప్యూటేషన్ల పేరుతో మార్పు, చేర్పులు..

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్వాలిటీ సెల్ విభాగంలో పని చేసిన సహాయ ఇంజినీర్ (ఏఈ) ఒకరు అనంతపురం పీఆర్ఐ సబ్ డివిజన్–1కు ఇన్‌చార్జ్ డీఈఈ(ఎఫ్ఏసీ) హోదాలో వచ్చి వాలిపోయారు. ఈ ప్రభుత్వం మాది అనే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అదే సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధి అండతో చాలా సులువుగా డీఈఈ (ఎఫ్ఏసీ) పోస్టును దక్కించుకున్నారు. ఇప్పటి వరకూ ఆ పోస్టులో కొనసాగిన డీఈఈ తన పాత పోస్టు అయిన పీఐయూ సబ్ డివిజన్‌కు వెళ్లక తప్పలేదు. అయితే ఇక్కడికి వచ్చాక.. ఇప్పటి వరకూ ఆ పోస్టులో ఇన్‌చార్జ్ డీఈగా కొనసాగుతున్న మరో బలమైన సామాజిక వర్గానికి చెందిన సహాయ ఇంజినీర్ ఆ సీటు వదిలేందుకు ఇష్టపడటం లేదు. తన రిటైర్డ్‌మెంట్ మరి కొన్ని నెలలే ఉండడంతో అప్పటి వరకూ ఆ పోస్టులోనే కొనసాగుతానని భీష్మించారు. అయితే ఈ వ్యవహారం రెండు జిల్లాల్లో తీవ్ర చర్చకు దారి తీయడంతో చివరకు ఆ శాఖ ముఖ్య అధికారి కల్పించుకుని దుప్పటి పంచాయితీతో ఆ డీఈకి ఉద్యోగుల జీతాల చెల్లింపు బాధ్యతలు అప్పగించారు. కీలకమైన పనుల పర్యవేక్షణ బాధ్యతను ఎఫ్ఏసీ హోదాలో కొనసాగుతున్న ఏఈకి అప్పగించారు. అలాగే పీఆర్ఐ సబ్ డివిజన్–2 రెగ్యులర్ డీఈకు కేవలం అడ్మిన్ (ఉద్యోగుల జీతాల బిల్లులు పెట్టే బాధ్యత) బాధ్యతలు అప్పగించి, పనుల పర్యవేక్షణ బాధ్యత ఉరవకొండ డీఈకి అప్పగించారు. ఆయన ఇప్పటికే ఉరవకొండ రెగ్యులర్ డీఈఈగా కొనసాగుతుండగా, అదనంగా అనంతపురం పీఆర్ఐ–2 బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

ఏడు సబ్ డివిజన్లు ఉండగా..

పంచాయతీరాజ్ శాఖలో మొత్తం ఏడు సబ్ డివిజన్లు ఉన్నాయి. ఇందులో అనంతపురం–1 (అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాలు), అనంతపురం–2(శింగనమల), తాడిపత్రి, గుత్తి, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం సబ్ డివిజన్లు ఉన్నాయి. ఇందులో అనంతపురం–1, తాడిపత్రి సబ్ డివిజనల్ అధికారులుగా అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈలు) ఎఫ్ఏసీ కింద డీఈఈలుగా కొనసాగుతున్నారు. మిగిలిన వారిలో కనీసం ఐదుగురు త్వరలో జరిగే బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లనున్నారు.

ప్రక్షాళన చేయాల్సిందే..

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పంచాయతీరాజ్ శాఖలో పరిణామాలు ఊహించని విధంగా మారిపోతున్నాయి. ఇన్నాళ్లూ లూప్‌లైన్‌లో ఉన్న అధికారులు ఇప్పుడు తాము కోరుకున్న కీలకమైన పోస్టుల్లోకి వచ్చి చేరిపోతున్నారు. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకున్నా.. డిప్యూటేషన్ల పేరుతో కీలక పోస్టుల్లో కర్చీఫ్ వేసేస్తున్నారు. అనంతరం రాజధానిలోని ఈఎన్‌సీ కార్యాలయం నుంచే డిప్యూటేషన్ ఉత్తర్వులు తెచ్చుకుని చేరిపోతున్నారు. ఒకరిద్దరు డిప్యూటేషన్లపై వచ్చిన వారు లేనిపోని రాజకీయాలు చేస్తూ కార్యాలయాల్లోని వాతావరణాన్ని చెడగొడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరందరికీ పంచాయతీరాజ్ శాఖ పునరావాస కేంద్రంగా మారిందంటూ ఆ శాఖ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సంపూర్ణ ప్రక్షాళన జరిగితే గానీ అనుకున్న మేర అభివృద్ధి సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.